క్లుప్తంగా

సజ్జలతో మాజీ ఎమ్మెల్యే భేటీ



ప్రభుత్వ సలహాదారు సజ్జలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వ (ప్రజా వ్యవహారాలు) సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో బుధవారం ఉరవకొండ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భేటీ అయ్యారు. తాడేపల్లిలో జరిగిన సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను సజ్జల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కోరారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి రమ

కుందుర్పి: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి రమ ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను పాఠకులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అసిస్టెంట్ భాస్కర్‌కు సూచించారు.

మాలధారులకు అన్నదానం

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఛాయపురం గ్రామానికి చెందిన లీలా కృష్ణప్రసాద్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన సేవా సమితి కమిటీ ప్రతినిధి మీనుగ వెంకటేష్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి కాయగూరలు అందజేస్తున్నా బాలాజీ, వలీసాబ్, మీనుగ లాలు స్వామి శాశ్వత దాతలుగా ఉన్నారన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం



తారకాపురంలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంటు బుధవారం ప్రారంభించారు. ఉరవకొండ రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి ప్లాంటును ప్రారంభించారు. 2010లో గ్రామ స్వరాజ్య నిధులు రూ.10 లక్షలు డిపాజిట్ చేయగా అందులో వచ్చిన వడ్డీ రూ.8 లక్షల వ్యయంతో తారకాపురం గ్రామస్తులకు శుద్ధజలం అందించాలని ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశామని ఆర్డీ తెలిపారు. అనంతరం 250 కుటుంబాలకు వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతపురం డైరెక్టర్ దాదా, కణేకల్లు ఏటీఎల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ ప్రారంభోత్సవం

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం ప్రారంభిస్తారని ఎంపీపీ కరణం పుష్పవతి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

కళ్యాణదుర్గం: స్థానిక కరణం భవన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ హాజరవుతారన్నారు. పార్టీ పదాధికారులు, నాయకులు హాజరు కావాలన్నారు.

అపోహలు వీడి రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉరవకొండ: యువత, విద్యార్థులు అపోహలు వీడి రక్తదానం చేయాలని అర్బన్ సీఐ తిమ్మయ్య సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఉరవకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో పట్టణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సీఐ తిమ్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా 80 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ డిప్యూటీ మేనేజర్ అరవింద్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అరుణజ్యోతి, పట్టణ మెడికల్ ఆఫీసర్ శంకర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ పీఓలు వెంకటరాముడు, ఎస్సై అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

- ఆయన స్ఫూర్తితోనే 'జగన్' పాలన
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- వర్ధంతి సందర్భంగా బాబాసాహెబ్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: సమాజానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప దార్శనికుడు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. ఆ మహనీయుని స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే దిక్సూచిగా నిలుస్తోందన్నారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, ఎంపీపీ విద్యావతి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టీ సిద్దప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ వన్నూరప్ప, నాయకులు చందన రామాంజినేయులు, శివారెడ్డి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విప్ మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా ఏపీలో సామాజిక విప్లవం కొనసాగుతుందన్నారు. భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందిస్తే దాన్ని ఆచరించేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమాజంలో గౌరవం పెంచేలా సంక్షేమం నుంచి రాజ్యాధికారం వరకూ సీఎం పెద్దపీట వేశారన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులకు అంబేడ్కర్ గుర్తుకు రావడం గొప్ప విశేషమని ఎద్దేవా చేశారు. గడిచిన నాలుగున్నరేళ్లలో అంబేడ్కర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలు ఈ స్థాయిలో ఎందుకు నిర్వహించ లేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు..? సాధారణ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఇలాంటి గిమ్మిక్కులు చేయడం కాలవకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు గుమ్మఘట్ట కేఎం రాజు, ఉడేగోళం సర్పంచ్ దుర్గమ్మ, ఉలిగప్ప, అమరేష్, టీ వీరాపురం మహేష్, బొమ్మక్కపల్లి రామాంజనేయులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కొలిమి ఆనంద, రైతు సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి, ఆవుల దట్ల నారాయణనాయక్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ..

ఉరవకొండ: అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఉరవకొండ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఉపసర్పంచ్ వన్నప్ప, మండల సమన్వయకర్త ఓబన్న, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, నాయకులు ఈడిగప్రసాద్, వన్నూర్ సాబ్, వెంకటేష్, నిమ్మల వెంకటరమణ, మల్లి, అంగడాల ఆంజి, జోగిభీమా, విజయ్, ప్రసాద్, యన్నప్ప, ఓబుళేసు, రామిరెడ్డి పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణమూర్తి, వైబీ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ప్రభావతి, ఏసేపు, రాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు అనిల్‌కుమార్, రాజేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కో ఆప్షన్ సభ్యుడు హిదయతుల్లా, పీడీ నాగేంద్ర, కేఎం రాజు, స్వామి, రామప్ప, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, సామాజిక కార్యకర్త బెంజిమెన్, జేవీవీ జిల్లా నాయకుడు మల్లికార్జు న, మైనార్టీ విభాగం అధ్యక్షుడు పట్టా ఖాజాపీరా, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కూడేరు: అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం బుధవారం కూడేరులో దండోరా, సీపీఐ, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో దండోరా నాయకులు అక్కన్న, వైఎస్సార్ సీపీ నేతలు ఓబులేసు, శంకర్‌నాయక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: వర్ధంతి సందర్భంగా అండేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం జెడ్పీటీసీ గుద్దెళ్ళ నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు పాతన్న, మైలారప్ప, మారెన్న, మార్కు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ-2 హరికృష్ణ, హెచ్ఎం వెంకటప్రసాద్, పీడీ రాజశేఖర్‌రెడ్డి, ఎంఎస్ కోఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు : వర్ధంతి సందర్భం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పోస్ట్ రామకృష్ణ, ఎమ్మెఎస్ హనుమంతరాయుడు, టైలర్ వన్నూరుస్వామి, బాబురావు, గౌరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని ఎంపీపీ మారుతమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి సూచించారు. వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్ర తదితరులతో కలసి వరాఉ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాలమాన్, పార్టీ నాయకులు గోళ్ల మోహన్ రెడ్డి, సుధీర్, బిక్కి హరి, హరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తూర్పు కోడిపల్లిలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీమతి కాంచన గంగ, డీస్ మూర్తి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



ఉరవకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ మారుతమ్మ, నాయకులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డీఈ హనుమప్ప

కూడేరు: వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ హనుమప్ప సూచించారు. బుధవారం ఆయన మండల సిబ్బందితో కలసి కూడేరులో ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. బేస్ మట్టం, టాప్ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణ దశను బట్టి బిల్లులను వెంటనే అందజేస్తామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 115 మంది పునాదులు తవ్వకోలేదన్నారు. 274 బేస్ మట్టం, 85 టాప్‌లెవల్‌లో నిర్మాణాలున్నాయన్నారు. పునాదులు తవ్వని ఇళ్లను రద్దు చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఏఈ శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఫీజు' ప్రభుత్వమే భరించాలి

కళ్యాణదుర్గం రూరల్: కరువు జిల్లా 'అనంత'లో విద్యార్థుల ఫీజులు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతుర్ పరమేష్, జిల్లా అధ్యక్షుడు శివ కోరారు. ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభల సందర్భంగా బుధవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావిధానం వల్ల పేద పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. 77 జీఓను ప్రవేశపెట్టి బీసీ విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రాకుండా చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, జిల్లా సహాయ కార్యదర్శి గిరి, పట్టణ అధ్యక్షుడు ధనుష్, కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన అవసరం

రాయదుర్గం: ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాయదుర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కరుణ కుమారి సూచించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు బుధవారం రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎం, వీవీప్యాట్‌లపై నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడారు.. ప్రజలకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు కార్యక్రమంలో తహసీల్దార్లు ఓబులేసు, రజాక్‌వలి, శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఈశ్వర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, బసవకుమార్, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రతి ఒక్క ఓటరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీ వెంకటేశులు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అన్ని రాజకీయ పార్టీలు, ఓటర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి మండలంలో ఎన్నికల విభాగం అధికారులు ఆయా బీఎల్వోల సమన్వయంతో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయకుడు శ్రీనివాసులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కుల గణన సర్వే చరిత్రాత్మకం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఓ చరిత్రాత్మకమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ కొండయ్య అధ్యక్షతన కులగణనపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు. విప్ మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో యానాది, యలవ, పాళగార్ (కావలి) కులాలున్నా పాళెగార్ కులప్రస్తావన వచ్చేటప్పటికీ బోయలుగా సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. యానాదిలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక పోవడంతో వారు పలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. వారి ఇబ్బందులను అధికారులతో చర్చించి చివరకు బీసీ సర్టిఫికెట్లు ఇప్పించగలిగామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటా సర్వే చేసి కులగుణన పకడ్బందీగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విద్యావతి, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా, ఉడేగోళం పీఏసీఎస్ చైర్మన్ భీమన్న, రేకులకుంట శివారెడ్డి, డీటీ సురేష్ బాబు, ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఎంఈఓ నాగమణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, ఏఓ మహేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేతో సామాజిక అభివృద్ధి, విద్య, సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు ఖచ్చితంగా చేరుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి రాయదుర్గం పురపాలకసంఘంలో ప్రారంభమయ్యే కులగణన సర్వేపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి పట్టణ ప్రముఖులు, కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, ప్రభుత్వ ఖాజీలు సైపుల్లా, అతావుర్ రెహమాన్, కౌన్సిలర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: కుల గణన సర్వేను పకడ్బందీ చేయాలని ఎంపీడీఓ షకీలాబేగం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిలకు కులగణన సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఓపీఆర్డీ విజయమ్మ, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, సర్పంచులు అనిల్,రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

రాయదుర్గం రూరల్: ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకురావాలని ఈఆర్ఓ కరుణ కుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె అఖిలపక్ష పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఐదు మండలాల తహసీల్దార్లు ఓబులేసు, బ్రహ్మయ్య, బాల ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రజాక్ వలి, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, ఈడీటీ సుజాత, డీటీలు రఘు, బసవకుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, రామాంజనేయులు , ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం: కణేకల్లు మండలంలోని బేనేకళ్ గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీఆర్ దాస్, జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షులు ఎల్లన్న, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కదిరప్పలు డీఎస్పీ శ్రీనివాసులును కలసి విన్నవించారు.

బస్సుయాత్ర సక్సెస్‌తో టీడీపీలో వణుకు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాయదుర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ ఏకమై తరలివచ్చి బ్రహ్మరథం పట్టాయని, దీన్ని చూసి ఓర్వలేక టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు కడుపుమంటతో రగిలిపోతున్నాడని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు ఎన్‌టీ సిద్దప్ప, బీటీపీ గోవిందు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు.. రాయదుర్గంలో మంగళవారం నిర్వహించిన బస్సుయాత్ర విజయవంతమైందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రాయదుర్గం పర్యటనలో వచ్చిన జనం కంటే రెట్టింపుగా బస్సుయాత్రకు జనం తరలివచ్చారన్నారు. అయితే ఎల్లో మీడియా మాత్రం కళ్లుండి కబోదిలా వ్యవహరించిందన్నారు. కావాలనే జనం లేరంటూ తప్పుడు రోతలు సృష్టించి ప్రజల్లో అభాసుపాలయ్యారని మండిపడ్డారు. ఇలాంటి కుట్రలు ఎన్ని పన్నినా 2024 లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేలా కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ విప్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మోసగాడు చంద్రబాబును నమ్మొద్దు



ఎస్.హనుమాపురం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



షేక్షానుపల్లి సచివాలయ పరిధిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ ప్రజాప్రతినిధులు

కణేకల్లు: 610 హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబును నమ్మొద్దని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావుతో కలసి ఆయన సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్‌లో పార్టీ జెండా ఎగుర వేసి 2024 ఎన్నికల్లో రాష్ట్రానికి సీఎంగా జగన్ ఎందుకు అవసరమో నాయకులు ప్రజలకు వివరించారు. నాయకులు హర్షవర్ధన్, సురేంద్ర, సంతోష్, కెనిగుంట రామిరెడ్డి, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి, వేమన, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరవకొండ: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి మరోమారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండాలని ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని షేక్షానుపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల రూరల్ కన్వీనర్ సుంకన్న, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు లింగన్న, వడ్డే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కణేకల్లు: మండలంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీపీ హెచ్.సంధ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భవానీశంకర్, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి పరిశీలించారు. విద్యార్థుల కోసం చేసిన వెజిటబుల్ పలావ్‌ను రుచి చూశారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా చేయాలని వారు సూచించారు.

ఎద్దుల బండిని ఢీకొని వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం తండా మలుపు వద్ద ఎద్దుల బండిని వెనుకవైపు నుంచి ఢీ కొన్న సంఘటనలో ఓంకారప్ప (38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాయదుర్గం పట్టణం భగత్ సింగ్ కాలనీ వాసి ఓంకారప్ప తన స్నేహి తుడు వెంకటేశులతో కలసి బుధవారం ద్విచక్రవాహనంలో కర్ణాటకలోని హిరికెరహళ్లికి వెళ్లి, తిరిగి వస్తుండగా మల్లాపురం తాండా మలుపు వద్ద ప్రమాదం జరిగింది. ముందువెళుతున్న ఎద్దులబండిని గమనించకుండా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఓంకారప్ప అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న వ్యక్తికి ఎలాంటి దెబ్బలు తగలలేదు. భార్య నాయకుల గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ మురళి మోహన్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న వైకేపీ ఏపీఎం రామ్మూర్తి

కళ్యాణదుర్గం/కూడేరు/గుమ్మఘట్ట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వైకేపీ ఏపీఎం రామ్మూర్తి అన్నారు. కళ్యాణదుర్గం మండలంలోని పాలవాయి, మల్లాపురం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫ్రాంచ్ దేశీయుడు ఎంధ్రిక్ , ఐదు మండలాల వైకేపీ ఏపీఎంలు, డీఆర్‌డీఏ ఉద్యోగులు , రైతులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలంలోని జయపురం, ఉదిరిపికొండ, ముద్దలాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, నార్పల , కూడేరు మండలాలకు చెందిన వైకేపీ ఏపీఎంలు, మహిళా సమాఖ్య అధ్యక్షులు పరిశీలించారు. అనంతపురం డివిజన్ మాస్టర్ ట్రైనర్ రమణయ్య , ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ ముక్కా వెంకటేష్, సిబ్బంది కుళ్లాయప్ప, సురేష్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా గుమ్మఘట్ట మండలంలోని 75వీరాపురం గ్రామం సమీపంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర, కణేకల్లు ఏపీఎం గోవిందు, ఎన్ఎఫ్ఎంటీ భీమన్న, పీఆర్‌పీ సత్యనారాయణ, సుధాకర్, ఐసీఆర్‌పీ బాలునాయక్, రైతులు పాల్గొన్నారు

తక్షణసాయం అందజేత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో మొహమ్మద్‌రఫీక్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ ఆర్థిక సాయాన్ని బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాసయాదవ్, వార్డు ఇన్‌చార్జ్ బషీర్ అహ్మద్ అందజేశారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు త్వరలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫకృద్దీన్, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గంగాధర్, దస్తగిరి, రామకృష్ణ, వలంటీర్ పద్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న ఇగురు తిని గొర్రె మృతి

బెళుగుప్ప: మండలంలోని రామసాగరంలో రైతు రంగప్పకు చెందిన ఒక గొర్రె జొన్న ఇగురు తిని మృతి చెందగా మరో పది జీవాలు అస్వస్థకు గురయ్యాయి. సమాచారం అందగానే పశువైద్యాధికారి రమేష్ అంకంపల్లి పశు సంవర్ధక అసిస్టెంట్ మారుతిని గ్రామానికి పంపి చికిత్సలు అందించి మిగిలిన గొర్రెలు మృత్యువాత పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జొన్న ఇగురులో హైడ్రోజన్ సైనైడ్‌అనే విషపదార్థం ఉంటుందని, జీవాలు జొన్న ఇగురు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు ఆయన సూచించారు.